# లవ్లీ రిటార్ట్

- ఎన్.హరిప్రియ

1999 శతాబ్దానికి చివరి సంవత్సరం. గడచిన శతాబ్దానికి 'సెండాఫ్' ఇవ్వటానికో, రాబోతున్న కొత్త శతాబ్దానికి 'వెల్‌కం' చెప్పటానికో అన్నట్లు ఈ సంవత్సరం మల్లెపూలు విరగబూశాయి. మామిడి పళ్లు విరగకాశాయి. సామాన్యుల కరువు కూడా తీర్చాయి. తృప్తిపరిచాయి.

ఈ సంవత్సరం పెళ్లిళ్లూ, శుభకార్యాలూ అంతే ఎక్కువగా జరగసాగాయి. కారణం... కొత్త శతాబ్దపు ప్రారంభంలో మొదటి సంవత్సరానికి 2000గా చివర అన్నీ సున్నాలే వచ్చాయన్న సెంటిమెంట్ బలంగా పనిచేసి చాలామందిని శుభకార్యాలకి ప్రేరేపించి హడావుడి పెడుతోంది.

ఓ నట్టింట పెళ్లిచూపుల ముచ్చట జరుగుతోంది.

అమ్మాయి ముద్దుగుమ్మలా ముద్దుముద్దుగా ఉంది!

అబ్బాయి బొద్దుగా, కళ్లనిండుగా, కడుపునింపేలా ఉన్నాడు.

అమ్మాయి తండ్రి మూర్తిగారు సత్సంప్రదాయాలను గౌరవించి సనాతనాచాలను తూ.చ. తప్పకుండా ఆచరించే తత్వంగలవాడు. తన హద్దును అతిక్రమించకపోవటం, పెద్దలను గౌరవించటం, సాటివారిని ప్రేమించటం ఆయనకున్న మంచి లక్షణాలు.

అమ్మాయి వినతి తండ్రికి తగ్గకూతురే. అందానికి అందం, చదువుకు చదువు, తెలివికి తెలివి ఉన్న పిల్ల! వాటికి మెరుగులు దిద్దుకుని అణకువ, నమ్రత, వినయ విధేయతలను కూడా పుష్కలంగా అలవరచుకుంది. కానయితే అనవసర అనుచిత కార్యాలను సహించదు. ముక్కుసూటిగా పోయే మనిషి.

అలాంటి వినతికి డిశంబరులోగా పెళ్లి చేసేసి బరువు దించుకోవాలని నిర్ణయించుకున్నారు మూర్తిగారు. అంటే వినతి ఆయనకు బరువైందని కాదు. ఎదిగిన ఆడపిల్లని కళ్లెదురుగా పెట్టుకుని ఇబ్బంది ఫీలవటం ఆయనకు ఇబ్బందిగా ఉంది. చదువుకున్నన్నాళ్లూ వాళ్లకీ టైమ్‌పాస్ ఔతుంది. కన్నవాళ్లకీ ఆ ఆలోచన రాదు. ఉద్యోగం చేయించి లోకోపవాదు భరించటం ఆయన అభిమతం కాదు. సంవత్సరం నుండి ఖాళీగా కూర్చుని గోళ్లు గిల్లుకోవటం ఆయనకే కాదు ఆ అమ్మాయికీ ఇబ్బందిగానే ఉంది. మూర్తిగారి కుటుంబ, వంశ పరువు ప్రతిష్ఠలు, అమ్మాయి అందచందాలు, స్వయం ప్రతిభ దశదిశలా పాకి అబ్బాయి తండ్రి వీరభద్రంగారి దృష్టికి వచ్చి ఎలాగైనా ఈ సంబంధాన్ని వదులుకోకూడదనుకున్నారు. అమ్మాయి ఐడెంటిటీ ఒక్కటే కాదాయన్ని ఆకర్షించింది. ఒక్కతే అమ్మాయి. మూర్తి ఆస్తికి ఏకైక వారసురాలు. కొడుకు పార్థుకి ఇక్కడైనా అక్కడైనా ఏకచ్ఛత్రాధిపత్యమే. తలచుకుంటే గాలిలో తేలిపోతూ విమానాల్లో విలాసంగా విహరించగలడు. తన ఆస్తితో వాళ్ల ఆస్తికూడా కలగలిసి ఒక ఎస్టేటే కాగలదు. అందుకే పార్థుతో సంప్రదించి పెళ్లిచూపులకు వస్తున్నట్లు కబురుపెట్టారు.

తండ్రి విధేయుడైన పార్థు అంగీకారంగా తలూపి బయలుదేరాడు.

సత్సంప్రదాయ సిద్ధంగా పెళ్లిచూపులు ఏర్పాటుచేశారు మూర్తిగారు.

మేనెల... నడివేసవి. గొంతులు ఎండిపోతున్నాయి. పైగా పార్థుకి మాటకి ముందు కాఫీ, టీలు సేవించే అలవాటు. ఆ ప్రయత్నమేదీ అక్కడ జరగటంలేదని గ్రహించి మొహమాటాన్ని పక్కనెట్టి నిర్మొహమాటంగా మధ్యవర్తిచేత అడిగించాడు.

అందుకు మూర్తిగారేమీ జంకలేదు. భయపడలేదు. అంతే నిర్మొహమాటంగా ''గతికితే అతకద''న్న సామెతను పునఃశ్చరణ చేశారు.

నేటి అమెరికా అబ్బాయి-- ఆంధ్రా అమ్మాయి టైపులో హైటెక్ పద్ధతిలో కాకుండా అచ్చమైన ఆంధ్రా సంస్కృతిని అనుసరిస్తూ తెలుగుతనం ఉట్టిపటేలా. అప్పుడే వినతి బుగ్గల్లోకి సిగ్గు గులాబి రంగై చేరింది. పార్థుని చూడగానే అది రెట్టింపై ఎర్రబడి కలల లోకంలోకి విసిరివేసింది.

తొలిప్రేమ అనేదానికి అంకురార్పణ జరిగింది. ఆకర్షణకి బీజం పడింది.

మూర్తిగారివైపు అంగీకారం కుదిరింది. ఐనా నేటి ఆధునికతను అనుసరిస్తూ కాఫీ, టీ, టిఫిన్లు, కూల్ డ్రింక్స్ వగైరా టైపులో కాకుండా వెనకటి పద్ధతిని పాటించదలచుకుని కాళ్లు కడుక్కోటానికి తప్ప గొంతు తడుపుకోటానికి చుక్క మంచినీళ్లివ్వలేదు. సకల మర్యాదలు జరిపేందుకు అన్ని ఏర్పాట్లైతే చేశారు. కానీ అవన్నీ ''పిల్లనచ్చింది'' అన్న మెసేజ్‌ని అందుకున్న తరువాత ఆచరించటానికే నిశ్చయించుకున్నారు.

మేనెల... నడివేసవి. గొంతులు ఎండిపోతున్నాయి. పైగా పార్థుకి మాటకి ముందు కాఫీ, టీలు సేవించే అలవాటు. ఆ ప్రయత్నమేదీ అక్కడ జరగటంలేదని గ్రహించి మొహమాటాన్ని పక్కనెట్టి నిర్మొహమాటంగా మధ్యవర్తిచేత అడిగించాడు.

అందుకు మూర్తిగారేమీ జంకలేదు. భయపడలేదు. అంతే నిర్మొహమాటంగా ''గతికితే అతకద''న్న సామెతను పునఃశ్చరణ చేశారు.

పార్థుకి ఒకింత ఒళ్లు మండినా తమాయించుకుని ''ఇంట్లో చేసింది పట్టింపైతే బైట నుండి తెప్పించి ఇప్పించమ''ని చెప్పించాడు.

'వేడి తగలకూడ'దన్నారు. అలాఐతే కాపురమంతా వేడి గాడ్పులు వీస్తాయన్నారు. కనీసం డ్రింకైనా ఇప్పించమన్నాడు.

''డ్రింకులు తాగటం మా ఇంటావంటాలేదు'' అన్నారు.

''డ్రింకులంటే... ఆ డ్రింకులు కాదు. కూల్ డ్రింకు'' అన్నాడు.

''అదీ వీలుకాదు'' అని ఏ పట్టింపూలేని మంచినీళ్లిప్పించారు తప్ప. కొంత పట్టుసడలించారు. అడిగిన నేరానికి ఓ గుటకవేసి ఊరుకున్నారు.

జరిగిన ఈ అవమానానికి తప్పకుండా ప్రతీకారం తీర్చేసుకోవాలని దృఢంగా నిశ్చయించేసుకున్నారు.

'మగ' పెళ్లివారికి అదొక ప్రారంభ అవమానంగా అనిపించింది.

''ఐనా ఫరవాలేదు. ముందుంది ముసళ్లపండగ'' అనుకున్నారు.

పిల్లతోపాటు అన్నీ నచ్చినా మొహంమీదే అలా చెప్పేస్తే లోకువైపోయి తేలికైపోతామన్న 'అహం' అడ్డొచ్చింది. 'మగపెళ్లివారం' అన్న ధీమా తలెత్తింది. పైగా ప్రతీకార చర్య ఒకటి కొత్తగా తలెత్తింది. కూర్చున్న తీరులో... దర్పం, ఠీవి, దర్జా

ఎలా ప్రదర్శించాలో అంగీకారం తెలపటంలో కూడా తమ ఇగోని ప్రదర్శించాలని నిర్ణయించుకున్నారు. మూర్తిగారు మగవాడైనా ఆడపిల్ల తండ్రి కావటాన కొంత విధేయత ప్రదర్శించవలసి వచ్చింది. అబ్బాయివైపు నుండి ఏం సమాధానం వస్తుందోనన్న ఆతృతను మనసులోనే అణచిపెట్టి తొందరపాటును తొక్కిపెట్టి ఆశనింపుకున్న కళ్లతో చూస్తూ నిలబడ్డారు. ఔనంటారని ఆశ! కాదంటారేమోనన్న భయం.

ఆడపిల్లవారిని అంతతొందరగా సంతోషపెట్టటం మగపెళ్లివారికి ఆచారం, సంప్రదాయం కాదేమో! సాంప్రదాయానుసారం అభిప్రాయం కానేకాదు.



అభిమతం అసలేకాదు. అందుకే వీరభద్రంగారు మూర్తిగారి కళ్లలోకి లోతుగా చూస్తూ ''వెళ్లి ఉత్తరం రాస్తాం'' అనే పాతపద్ధతిలో కాకుండా ఆంగ్లానువాదంలో ''వెయిటండ్ సీ'' అని నైస్‌గా చెప్పారు.

పార్థు అలవాటుగా తల ఊపాడు.

''మావారు బంగారుకొండా''.. అనో

''శ్రీవారంటే మావారే''.. అనో చెప్పుకుని మురిసిపోయేలా పార్థు తన భర్తై తనను అలరిస్తాడని మురిసిపోతున్న వినతి ఒళ్లు మండింది. అప్పటికప్పుడే అన్నీ కుదిరిపోతున్న ఈస్పీడ్ యుగంలో నాన్నగారి పాతపద్ధతులే నచ్చకపోతుంటే అంతకంటే పాత పద్ధతిలో నాన్నచాటు బిడ్డలా పార్థు 'వెయిటండ్ సీ'ని సమర్థించటం అగ్నిలో ఆజ్యం పోసినట్లయింది. అసలీ సంబంధాన్నే వద్దనేద్దామనుకుంది. కారణాలు కనపడకపోగా తండ్రికి బాగా నచ్చినట్లుంది. వాళ్లు ఏసంగతీ చెప్పిందాకా ఓర్పు వహించక తప్పదు. లేకపోతే తామే తొందరపడినట్లుంటుంది.

'సంబంధం వద్దు' అన్నప్పటి పరిస్థితివేరు. దులిపెయ్యటానికి కొంత అవకాశం ఉంటుంది. అలాకాక అమ్మాయి నచ్చి పెళ్లికి లైన్ క్లియరైతే?..

వాళ్లు ఊరించీ.. ఊరించీ... ఆరు నెలల తరువాత నిశ్చితార్థానికి వస్తున్నట్లు కబురు పెట్టారు. మూర్తిగారు గుండెలనిండా తృప్తిగా గాలి పీల్చుకున్నారు గాని వినతికి మాత్రం అంతరంగం ఉడికిపోయింది.

ఝాం ఝాం అంటూ పెళ్లయిపోయింది. మూర్తిగారికి నిశ్చింత ఏర్పడింది.

వినతి తేలిగ్గా ఊపిరి పీల్చుకుంది. పూర్వంలా శోభనం జరిగిందాకా 'టచ్‌మినాట్'లా కాకుండా సరదాగా చెట్టాపట్టాలేసుకుని కబుర్లు చెప్పుకున్నారు. కళ్లతో పలకరించుకున్నారు. చూపుల్తో సరసాలాడుకున్నారు. శోభనానికి ముహూర్తం కుదిరింది. ఇప్పుడు పార్థుకి ఆతృత ఎక్కువైంది. ఎప్పుడెప్పుడు శోభన ఘడియలు ముందుకు దూసుకువస్తాయా అన్న ఆరాటం, తపన అతన్ని నిలవనీయటంలేదు. వినతి అంతగా అతన్ని ఆకర్షించి ఆకట్టుకుంది. ఏర్పాట్లు కూడా అంతే స్పీడుగా జరిగిపోతున్నాయి.

వినతి... అప్పుడు పేల్చిందో వార్త!

''నాకు నాలుగు నెలల వరకు వీలుకాదు'' డైరెక్ట్‌గా పార్థుతోనే చెప్పింది.

అదిరిపడ్డాడు పార్థు.

''అదెలా?''

''నా నియమం. మీరు నాకు భర్తయితే చాతుర్మాస్యవ్రతం చేస్తానని మొక్కుకున్నాను. అదీ మీ కోసమే కదండీ? అంతవరకూ బ్రహ్మచర్యం పాటించాలి. ఆ తరువాతే... శోభనం.''

''ప్లీజ్.. మళ్లీ నాకోసమే ఈ వ్రతాన్ని విరమించుకోలేవా?'' బ్రతిమాలాడు.

''వీలుకాదు. వెయిటండ్ సీ...''

నీరుగారిపోయాడు పార్థు.

ఆ 'వెయిటండ్ సీ' మాటల్లో ఎంతటి ఆత్రం, ఎంత టెన్షన్, ఎంత బాధ ఉన్నాయో త్వరలోనే తెలిసింది పార్థుకి!!

వినతికి కావలసింది అతడికి ఆబాధ తెలిసిరావటమే!!!

★